రెడ్‌క్రాస్, ఎన్‌సిసి ఆధ్వర్యాన రక్తదాన శిబిరం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అటానమస్ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం, యూత్ రెడ్ క్రాస్, ఎన్‌సిసి సమన్వయంతో తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ రామచంద్ర ఆర్‌కె ప్రిన్సిపల్ విద్యార్థులకు రక్తదానం వల్ల ఉపయోగాలను వివరించారు. జంతుశాస్త్ర విభాగాధిపతి కె.బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ రవితేజ, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఈసఫ్ బాషా జంతుశాస్త్ర పరిశోధన ల్యాబ్‌లో నిర్వహించారు. ఎ.సురేష్ పండ్లు, రెడ్ క్రాస్ బ్యాడ్జిలను రక్తదాతలకు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, యూత్ రెడ్ క్రాస్ కమిటీ మెంబర్స్ డాక్టర్ సురేష్, విజయశాంతి, డాక్టర్ అనూప, సీతామహాలక్ష్మి, రమణ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల గుండెల్లో వణుకు

- తుపాను ప్రకటనతో ఆందోళన
- కళ్లాల్లోనే 70 శాతం ధాన్యం

వాతావరణ శాఖ తుపాను ప్రకటనతో రైతుల గుండెల్లో వణుకు మొదలైంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా బలపడి తుపానుగా మారింది. దీన్ని ప్రభావం వల్ల ఇప్పటికే జిల్లాలో వాతావరణం మారిపోయింది. ఇంకా పంట కళ్లాల్లోనే ఉండటంతో అన్నదాతల్లో కలవరం మొదలైంది. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

ప్రజాశక్తి - రాజోలు, ఉప్పలగుప్తం, రాజమహేంద్రవరం రూరల్

బంగాళాఖాతంలో ఈ నెల 24న అల్పపీడనం ఏర్పడింది. ఇది క్రమంగా బలపడి తుపానుగా మారింది. దీని ప్రభావంతో బుధవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంది. తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. బుధవారం అర్ధరాత్రి నుంచి తుపాను ప్రభావం ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటించడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 5 లక్షల ఎకరాల్లో వరిని సాగు చేశారు. 12 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం కోతలు జరుగుతున్నాయి. చాలా వరకూ పంట కళ్లాల్లోనే ఉంది. సుమారు 5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఇంకా రైతుల వద్దే ఉంది. వీటిని పొలాల్లో, రోడ్ల చెంతనే ఉంచారు.

పంటను కాపాడుకునేందుకు బరకాలను కప్పుతున్న రైతులు

హడావుడిగా వరి కోతలు

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ఊపందుకున్నాయి. వరికోత మిషన్లతో రైతులు హడావుడిగా కోతలను నిర్వహిస్తున్నారు. దీంతో వరికోత మిషన్లకు డిమాండ్ పెరిగింది. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో కోత యంత్రాలు పని చేస్తున్నాయి. ఒక యంత్రం రోజుకు 10 నుంచి 12 ఎకరాల్లో వరి కోత కోస్తోంది. ప్రస్తుతం వరికోతలు ఆపాలని రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం కోతలు ప్రారంభిస్తే వర్షాలకు తడిపి ధాన్యం పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ బుధవారం సాయంత్రం వరకూ కోతలను కోసి ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. చాలా చోట్ల రైతులు కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు.

నేలవాలితే నష్టమే...

వరి కోత దశలో వర్షాలొస్తే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇప్పటికే కొన్నిచోట్ల నేలవాలిన పంటపై చినుకులు పడితే ధాన్యం మొలకలొచ్చే అవకాశం ఉంది. తుపాను గాలి వల్ల వర్షం పడి ఆగిపోతే పెద్దగా నష్టం ఉండదు. గాలి వేగం ఎక్కువగా ఉంటే పంట నేలవాలిపోతుంది. దీనివల్ల మొలకలొస్తాయి. యంత్రంతో కోత కోయడానికి ఎక్కువ సమయం పడుతుంది.

సూచనలు పాటిస్తే..

కోతకు వచ్చిన పంటను వెంటనే నూర్పిడి చేయాలి. కోతకు ఇంకా సమయం ఉంటే పొలంలో బాటలు చేసుకుని నీరు బయటకు వెళ్లేలా చూడాలి. బాటలు చేయడం వల్ల గాలికి పంట చిందరవందరగా పడిపోకుండా ఉంటుంది. వర్షపు నీరు పొలంలో నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మండలంలో వరి చేలు కోస్తున్న రైతులు వాతావరణ మార్పుల రీత్యా అప్రమత్తంగా ఉండాలి. వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులు వీలైతే ధాన్యం కోతలను వాయిదా వేసుకోవాలి. రైతులు తమకు నచ్చిన రైస్ మిల్లుకు ధాన్యం తరలించే వెసులుబాటు ఉండడంతోపాటు, 24 గంటల్లోనే వారి అకౌంట్‌లలో ధాన్యం తాలూకు సొమ్ము జమ అవుతుండడం రైతులకు శుభ పరిణామం. ఇటీవల ఎర్రకాలువ వరదల ముంపునకు గురైన కాల్దారి, పసలపూడి, సూర్యారావుపాలెం గ్రామాల్లో నీట మునిగిన వరి చేలు 38 నుండి 40 వరకు అధిక దిగుబడినిస్తున్నాయి.

- ఎం.విశ్వాసరావు, ఎఒ, ఉండ్రాజవరం

సామర్లకోటలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి

ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి

సామర్లకోటలో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట, కాకినాడ, యు.కొత్తపల్లి

ప్రభుత్వ విద్యను మరింతగా బలోపేతం చేయడానికి తనవంతు కృషి చేస్తానని తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తి హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం స్థానిక యర్రగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్, రాంపురం బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్స్‌ను ఆయన సందర్శించారు. ఆయా స్కూల్స్‌కు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను కలిసి ఓటును అభ్యర్థించారు. డిసెంబర్ 5న జరిగే ఉపాధ్యాయ నియోజకవర్గ ఎంఎల్‌సి అభ్యర్థిగా పిడిఎఫ్ తరఫున పోటీ చేస్తున్నానని, మీ యొక్క మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు నరవ సురేష్, డివైఎఫ్ఐ నాయకులు కె.తులసిరాణి, బి.ఎక్స్‌ట్, ప్రజాసంఘాల నాయకులు దారబాని కృష్ణ బి.శ్రీను, డి.సింహాచలం పాల్గొన్నారు.

కాకినాడలో మాజీ ఎంఎల్‌సి ప్రచారం

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మద్దతుగా కాకినాడ నగరంలోని పిఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. డిసెంబర్ 5న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును పిడిఎఫ్ బలపర్చిన గోపిమూర్తికి వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు కెఎంఎంఆర్.ప్రసాద్, యుటిఎఫ్ నాయకులు ఎం.గంగాసూరిబాబు, డి.ఆదర్శ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

యు.కొత్తపల్లిలో సిఐటియు ప్రచారం

ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి మద్దతుగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు యు.కొత్తపల్లి మండలంలో ప్రచారాన్ని నిర్వహించారు. మండలంలో పలు పాఠశాలలను సందర్శించిన ఆయన ఉపాధ్యాయులను కలుసుకుని గోపిమూర్తికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు, సి.హెచ్. సాంబశివరావు, జి.శ్రీనుపాల్గొన్నారు.

కాకినాడలో ప్రచారం చేస్తున్న మాజీ ఎంఎల్‌సి విఠపు

యు.కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

మంత్రి దుర్గేష్‌తో మాట్లాడుతున్న రాంబాబు

మంత్రి దుర్గేష్‌ను కలిసిన పార్క్ నిర్వాసితులు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పార్క్ నిర్మాణం కోసం స్థలాలు ఖాళీ చేసిన పేదలు తమకు న్యాయం చేయాని మంత్రి దుర్గేష్‌ను సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు ఆధ్వర్యాన బుధవారం కలిశారు. గణపతి సెంటర్లో చిన్న వ్యాపారాలు చేసుకుంటూ, పక్కనే గుడిసెల్లో నివాసం ఉంటున్న మైనార్టీ బలహీన వర్గాల చిరు వ్యాపారాలు, గుడిసెలు ఖాళీ చేయించారు. అప్పట్లో బాధితులు మున్సిపల్ చైర్మన్‌ను సంప్రదించగా తీరుగూడెం వైఎస్‌ఆర్ కాలనీ వద్ద 20 మందికి స్థలాలు కేటాయించి నెంబర్లు ఇచ్చారు. కానీ పట్టాలు ఇవ్వలేదు. దీంతో మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి సమస్య వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించాలని కోరగా త్వరలోనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాంబాబుకు తెలిపారు.

కార్టూన్ 'నిజం'



ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందించాలి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రభుత్వాసుపత్రుల్లో రోగులకు మెరుగైన చికిత్స అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ హాస్పిటల్స్ సూపరింటెండెంట్స్‌తో బుధవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ హాస్పిటల్స్ పనితీరు, భవన నిర్మాణాలు, సదరం సర్టిఫికెట్ల జారీ, ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్, తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యసాధనలో వెనుకబడి ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా సంతోషంగా జీవించాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో స్నేహ పూర్వకమైన వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ప్రాథమిక, ఏరియా, జిల్లా ప్రధాన ఆసుపత్రుల్లో ఒపి సేవలు, ల్యాబ్ టెస్ట్‌లు, ఐపి సేవల సామర్థ్యాన్ని పెంచాలన్నారు. ఎన్‌సిడి సిడి 3.0 సర్వే ప్రగతిపై సమీక్షించారు. ఆర్‌సి హెచ్ పోర్టల్లో నమోదైన గర్భిణులు, పిల్లల సంఖ్యను మెరుగు పర్చాలని ఆదేశించారు. ప్రతి నెలా పిఎంఎస్‌ఎంఎ కార్యక్రమం కింద గర్భిణులు, స్త్రీలకు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై సమీక్షిస్తూ లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్న పిహెచ్‌సిల పని తీరు మెరుగు పరుచుకోవాలని ఆదేశించారు. డెలివరీ కేసులన్నీ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే విధంగా ప్రజల్లో నమ్మకం కలిగించాలని, సుఖ ప్రసవాలకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సదరం సర్టిఫికెట్ల జారీలో వికలాంగులకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన జారీ చేయాలన్నారు. కింది సాయి సిబ్బంది నుండి వైద్యాధికారి వరకు ఎఫ్‌ఆర్‌ఎస్ అటెండెన్స్ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. హాస్పిటల్ అభివృద్ధి సంఘం నిధుల నుంచి హాస్పిటల్‌కు కావాల్సిన వైద్య పరికరాలు కొనుగోలు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యప్రభ, డిసిహెచ్‌ఎస్ అధికారి డాక్టర్ పద్మశ్రీరాణి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎన్.వసుంధర పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కరాటేలో గురుకులం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

కరాటే పోటీల్లో గెలుపొందిన డి.జైస్మిత్

క్రీడలు శారీరక మానసిక ఎదుగుదలకు దోహదపడతాయని శ్రీసత్య సాయి గురుకులం కరస్పాండెంట్ ఎ.శ్యామ్‌సుందర్ అన్నారు. ఇటీవల రామచంద్రాపురంలో నిర్వహించిన 24వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో అండర్-10 విభాగంలో శ్రీసత్య సాయి గురుకుల విద్యార్థి డి.జైస్మిత్ సాయి స్వర్ణ పతకం సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం రాజమహేంద్రవరంలోని శ్రీసత్యసాయి గురుకులంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో శ్యామ్‌సుందర్ మాట్లాడారు. క్రీడలు ఏకాగ్రతను పెంచుతాయన్నారు. ప్రిన్సిపల్ కె.గుర్రయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి వాటిని ప్రోత్సహిస్తున్నామన్నారు. డిసెంబర్ చివరివారంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు డి.జైస్మిత్ సాయి రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సోమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి-గోపాలపురం

ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ వరమని ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్య బాధిత కుటుంబాలకు సిఎం సహాయ నిధి నుంచి రూ.61,4032 చెక్కులను ఎంఎల్‌ఎ వెంకటరాజు అందజేశారు. మండలంలోని భీమోలు గ్రామంలో దొప్పసాని శ్రీనుకు రూ.25,166, వాదాలకుంటలో కొడమంచిలి సోమయ్యకు రూ.70,300, గుడ్డిగూడెంలో సుంకర శ్రీహరికి రూ.21,7380, జగన్నాథపురంలో యేళ్లిన సత్యనారాయణకు రూ.10,6800, కరగపాడులో పంది వెంకటలక్ష్మికి రూ.25,656, అదే గ్రామానికి చెందిన కోణాల శ్రీనుకు రూ.12,3730 చెక్కులను అందజేసినట్లు తెలిపారు. పలువురు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం ఎంఎల్‌ఎ వెంకట్రాజు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో వర్తించని వ్యాధులకు సిఎం సహాయ నిధి నుండి చెక్కులను అందజేసి బాధ్యత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారని తెలిపారు. వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి ఎంతో ఉపయోగకరంగా సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సత్యనారాయణ, గద్దే హరిబాబు, గంగ్డోతు శ్రీనివాసరావు, కోడి దేవీప్రసాద్, తదితర నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎంఎల్‌ఎ వెంకట్రాజు

నేడు, రేపు పీజీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ అటానమస్ కళాశాలలో పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్స్ గురువారం, శుక్రవారం నిర్వహించనుననట్టు ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె తెలిపారు. ఎపిపిజిసెట్ రాయక పోయినా అడ్మిషన్‌కు అర్హులని ఆయన తెలిపారు. తెలుగు-52, ఎం.కామ్-40, ఎకనామిక్స్-30, పొలిటికల్ సైన్స్-25, మ్యాథ్స్-34, ఫిజిక్స్-24, ఆర్గానిక్ కెమిస్ట్రీ-4 ఇ డబ్ల్యూఎస్, ఫిజికల్ కెమిస్ట్రీ-5, బోటనీ-18, జూవాలజీ-8, ఆక్వా కల్చర్-13 సీట్లు ఖాళీగా ఉన్నాయని పీజీ కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జున తెలిపారు. వివరాల కోసం కాలేజీ ఆఫీసులో సంప్రదించాలని తెలిపారు.

ల్యాండ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం భాస్కర్ నగర్‌లో ల్యాండ్ మాఫియాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, నవీన్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత కాశి నవీన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి స్థలాలు అమ్ముతున్న, కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సిటీ ఎంఎల్‌ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అసెంబ్లీ సాక్షిగా రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకు వెళ్లారని తెలిపారు. 2020లో రాపాక నాగేశ్వరి వద్ద తాను అగ్రిమెంట్ చేసుకుని నవీన్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ పేరుతో అపార్ట్మెంట్ నిర్మించానని, ఆ అపార్ట్‌మెంట్ స్థలానికి సంబంధించి గోలకోటి నాగేశ్వరరావు అనే వ్యక్తి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి కబ్జా చేయడానికి ప్రయత్నించినట్టుగా ఇప్పుడు తన దృష్టికి వచ్చిందన్నారు. నాగేశ్వరావుపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని, దీనిపై ఇప్పటికే త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తనతో పాటు తనకు స్థలం అగ్రిమెంట్ చేసిన నాగేశ్వరి కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తారని పేర్కొన్నారు.

అవయవ దానంపై ప్రచారోద్యమం అవసరం

ప్రజాశక్తి - నల్లజర్ల

అవయవదానంపై పెద్ద ఎత్తున ప్రచార ఉద్యమం నిర్వహిస్తామని అవయవదాత, ఎపి వైద్య ఉద్యోగుల సంఘం నేత జివివి.ప్రసాద్ వెల్లడించారు. నల్లజర్ల పిహెచ్‌సి ఆవరణలో జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా బుధవారం స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రసాద్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ అవయవదానంపై ప్రజల్లో నెలకొన్న అపోహలు తొలగిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించనున్నామని తెలిపారు. అవయవదాత ప్రసాద్‌ను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్ఐ రమేష్ అన్నారు. అవయవదానంతో పాటు ప్రజలకు ప్రచార అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ తెల్లం గంగాధరరావు, డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్ మాట్లాడారు. శ్రీ చైతన్య విద్యా సంస్థ ప్రిన్సిపల్ ఆర్.వెంకటేశ్వరరావు తమ సంస్థ తరపున పిహెచ్‌సికి కంప్యూటర్ యుపిఎస్ అందించారు. ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్ పిహెచ్‌సికి నాణ్యమైన మందులను అందజేశారు.

ప్రసాద్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

దేవరపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - దేవరపల్లి, గోకవరం

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అంగన్‌వాడీలు బుధవారం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని కె.నాగలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారం, నేరం అన్నారు. బాల్య వివాహాలు, బాలికల రక్షణ ఆరోగ్యం, అభివృద్ధికి ఆటంకం కాకుండా వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరం చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు బాల్య వివాహం జరగడానికి చేసిన ఏ ప్రయత్నాన్నైనా పంచాయతీ, ప్రభుత్వ అధికారులకు తెలియజేయాలన్నారు. 'బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎపిఎం మెంబర్స్ నాగలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శశికళ, విజయశాంతి పాల్గొన్నారు. గోకవరం మండల కేంద్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై ముక్తభారత్ అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కేండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ మండల సూపర్‌వైజర్స్ పి.ఇందిరా రాణి, చంద్రమ్మ, రంజని, అంగన్‌వాడీ వర్కర్స్, ఐకెపి విఒ ప్రమీల పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-రాజానగరం

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి పెట్టాలని పద్మశ్రీ సుభాష్ పాలేకర్, వ్యవసాయ కృషి విధాన ప్రచారకులు విజయ్ రాయ్ అన్నారు. మండలంలో దివాన్ చెరువు డిబివి.రాజు టౌన్‌షిప్‌లోని శ్రీ రాజరాజేశ్వరీ కళ్యాణ మండపంలో ప్రకతి వ్యవసాయ అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయ, ప్రకృతి ఉత్పత్తుల స్టాల్స్ ఏర్పాటు చేశారు. దీనిలో అంబటి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండల కేంద్రమైన ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల పారిశుధ్య కోఆర్డినేటర్ కత్తుల ప్రకాష్ అధ్యక్షతన పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్.సక్సేనా రాజు మాట్లాడుతూ వరల్డ్ టాయిలెట్స్ డే నిర్వహిస్తున్న సందర్భంగా ఆరుబయట మలవిసర్జన చేయరాదని, తప్పనిసరిగా మరుగుదొడ్లను వాడాలన్నారు. ఎఎన్‌ఎం జి.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులలో రక్తహీనత అధికంగా ఉందని, తప్పనిసరిగా బలవర్థక ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు, ఆశాలు చంద్రకుమారి, విజయకుమారి పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒ

నేరాలు ఘోరాలు

పాము కాటుతో రైతు మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతును పాము కాటు వేయడంతో మృతి చెందాడు. బుధవారం మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన పైన్ని వీర వెంకట సత్యనారాయణ (58) రోజు మాదిరిగానే పొలానికి వెళ్లి వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో అతనిని హుటాహుటిన సామర్లకోట ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అతను పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఈ సంఘటనపై సామర్లకోట పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

38 మద్యం సీసాల స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎక్సైజ్ అధికారులు బుధవారం మండలంలో నిర్వహించిన దాడుల్లో ఇద్దరు వ్యక్తుల నుంచి 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ కె.కోటేశ్వర్ తెలిపారు. కరప మండలం పెద్దాపురపాడు గ్రామానికి చెందిన యాళ్ళ శంకర్, వాసంశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తులతో పాటు మద్యం రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని గోవిందపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో సా రా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జున్ రావు తెలిపారు. అలాగే సూరంపాలెం గ్రామంలో ఒక వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 2 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

కులం పేరుతో దూషించిన కేసుపై విచారణ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక యువతితో గొడవపడి కులం పేరుతో దూషించిన కేసులో బుధవారం కొత్తపేట డిఎస్‌పి వై.గోవిందరావు కేసుకు సంబంధించి పలువురిని విచారించారు. రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామానికి చెందిన మద్దాల నిరీక్షణ ఆత్రేయపురం గ్రామం కాలువ రేవు సెంటర్లో ఉన్న స్వామి పూతరేకులు షాపులో పనిచేస్తోంది. ఈ నెల 5న నిరీక్షణ పనిచేయుచున్న సమయంలో పక్క షాపులో ఉన్న చింతా మారియ్య వచ్చి పూతరేకుల వ్యాపారం విషయంలో ఆమెతో గొడవ పెట్టుకుని కులం పేరుతో దూషించాడు. దీనిపై అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి డిఎస్‌పి వై.గోవిందరావు సంఘటన స్థలంలో మరియు స్థానిక స్టేషన్లో సాక్షులను పిలిచి పలు వివరాలను సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి - కడియం

మండలంలోని వేమగిరి 216వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థిని మృతి చెందినట్లు ఎస్ఐ బి.నాగదుర్గా ప్రసాద్ తెలిపారు. వేమగిరి గట్టు ప్రాంతానికి చెందిన కల్లా దుర్గ ఆమె మేనకోడలు పితాని రూపాదేవి(18)తో కలిసి స్కూటీపై డిగ్రీ పరీక్షలు రాయించేందుకు వేమగిరితోట నుంచి రాజమహేంద్రవరం వెళ్తుండగా, వేమగిరి సెంటర్ వద్ద రాజమహేంద్రవరం వైపు తిరుగుతుండగా రావులపాలెం వైపు నుండి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న ప్రైవేట్ కాలేజీ బస్సు స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీ అదుపుతప్పి కింద పడిపోవడంతో వెనక కూర్చున్న రూపాదేవి మీద నుండి బస్సు వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా రూపాదేవి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఎస్ఐ వెల్లడించారు.

సీనియర్ రాజకీయ నాయకుడు రాజేంద్ర ప్రసాద్ మృతి

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్రప్రసాద్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన కాంగ్రెస్, టిడిపి, వైసిపిలో పలు కీలక పదవులు నిర్వహించారు. ఆయన మృతికి మంత్రి కందుల దుర్గేష్, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ, మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణ కుమారి, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షుడు రవివర్మ, బొడ్డు రామాంజనేయులు, ఆగతి కృష్ణారావు సంతాపం తెలిపారు.

మోటారు వాహనాలను మైనర్లు నడపరాదు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మైనర్లు మోటారు వాహనాలు నడిపితే చట్ట ప్రకారం తల్లిదండ్రులకు శిక్షలు విధిస్తారని ఉండ్రాజవరం ఎఎస్ఐ కొప్పిశెట్టి రామకృష్ణ హెచ్చరించారు. మండలంలో తరచూ ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక తనిఖీల్లో పోలీస్ అధికారులు అటువంటి వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఒకసారి పట్టుబడితే అవగాహన కల్పిస్తామని, మరోసారి పట్టుబడితే జరిమానాతో పాటు శిక్ష కూడా ఉంటుందన్నారు. ఇటీవల మట్టి, పెంట, ధాన్యం, ఇసుక తదితరాలు తోలుకెళ్లే ట్రాక్టర్లకు మైనర్లను డ్రైవర్లుగా నియమిస్తున్నట్టు గమనించామని, వారికి అవగాహన కల్పించామని తెలిపారు. వాహనదారుడు వాహనానికి సంబంధించిన పత్రాలన్నీ కలిగి ఉండాలన్నారు.

గుండె పోటుతో విఆర్ఒ రాజు మృతి

ప్రజాశక్తి-రాజానగరం

నరేంద్రపురం విఆర్ఒ పెనుమర్తి గన్ని రాజు (48) బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. స్వగ్రామం జేగురుపాడులో అంత్యక్రియలు నిర్వహించారు. దీనిలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్ఒ, ఆర్‌డిఒ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత ఆధ్వర్యంలో బుధవారం నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ టి.సీతారామ్మూర్తి మాట్లాడారు. మూడు విభాగాల్లో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. నీటి వినియోగదారుల, పంపిణీ, రెవెన్యూ కేటగిరీల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు కీలక పాత్రను పోషించనున్నట్లు పేర్కొన్నారు. నీటిపారుదల మౌలిక సదుపాయాల శాస్త్రీయ మరియు క్రమబద్ధమైన అభివృద్ధి, నిర్వహణ విషయంలో వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కీలకమైన పాత్రను పోషించాల్సి ఉంటుందనీ స్పష్ట చేశారు. నీటి ప్రభావవంతమైన మరియు విశ్వసనీయ సరఫరా, పంపిణీ కోసం నీటిపారుదల వ్యవస్థ నిర్వహణ మరియు నిర్వహణ కొనసాగింపు, లబ్ధిదారు రైతుల నుంచి నీటిపారుదల నీటి రేట్లు రికవరీ చేయడంలో సమన్వయ పాత్ర పోషించడంతో పాటుగా పర్యావరణం, పర్యావరణ సమతుల్యత యొక్క రక్షణ బాధ్యతలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో నీటి వినియోగదారుల అసోసియేషన్ ఎన్నికలు నిర్వహణ చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎన్నికల పరిపాలన నిర్వహణ కోసం కాడా కమిషనర్ ఎన్నికల అథారిటీగా వ్యవహరిస్తారని రాణి సుస్మిత పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అథారిటీ జిల్లా కలెక్టర్, అదనపు జిల్లా ఎన్నికల అథారిటీ జాయింట్ కలెక్టర్, డిప్యూటీ జిల్లా ఎన్నికల అథారిటీగా ఆ రెవెన్యు డివిజన్ సబ్ కలెక్టర్, ఆర్‌డిఒ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఎన్నికల అధికారి-రైతు ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన అధికారిని ప్రతి ప్రాదేశిక నియోజకవర్గం పోలింగ్ అధికారినీ జిల్లా ఎన్నికల అథారిటీ నియమిస్తారని తెలిపారు. ఆర్‌డిఒ రాణి సుస్మిత శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా రూపకల్పన, ఓటరు గుర్తింపు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది భూ యజమానుల గుర్తింపు, ఓటరు జాబితా రూపకల్పన, ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ప్రాదేశిక నియోజకవర్గం పరిధిలో 'ఫారం ఇ తీసుకుని ఎక్కువ భూ విస్తీర్ణం కలిగిన చోట ఓటు హక్కు కల్పించడం, ఎన్నికల నిర్వహణ, ప్రాదేశిక నియోజకవర్గం వారీగా ఓటర్ల గుర్తింపు, ఓటు హక్కు కల్పించడం, మహిళా ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఓటరు స్లిప్ జారీ, ఓటు తిరస్కరణ, ఓట్ల లెక్కింపు, ఒక ప్రాదేశిక నియోజకవర్గం పరిధిలో ఒక నీటి సంఘంలో పదవిని కలిగి ఉండడం పరిమితిగా నిర్ణయించాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటి కలెక్టరు ఆర్.రమణ నాయక్, ఎస్.సరళ వందనం, కెఎల్.శివ జ్యోతి, ఎం.మాధురి, పౌర సరఫరాల డిఎం టి.రాధిక తహసీల్దార్లు, ఎంపిడిఒలు, ఇరిగేషన్ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, రెవెన్యూ, ఉపాధ్యాయులు తదితర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

బంగారు పతకం సాధించిన శ్రీవేద విద్యార్థి జశ్వీర్

శ్రీవేద విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - యానాం

ఆంధ్రప్రదేశ్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీ వేద పబ్లిక్ స్కూల్ విద్యార్థి కర్రి జశ్వీర్ బంగారు పతకాన్ని సాధించాడని ఛైర్మన్ గుత్తుల గోవిందజయ రామారావు, డైరెక్టర్స్ నీతూ, అర్జున్ బుధవారం తెలిపారు. ఈ నెల 25న రామచంద్రపురంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో నాలుగో తరగతి విద్యార్థి కర్రి జశ్వీర్ విశేష ప్రతిభను కనబరిచాడన్నారు. అలాగే యానాంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో మిడిల్ విభాగంలో మొదటి బహుమతిని శ్రీవేద స్కూల్ విద్యార్థి కాళ్ళ భానుతేజ గెలుచుకున్నాడన్నారు. వీరిద్దరిని పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి, విద్యాశాఖాధికారి పి.లక్ష్మణప్రవీణ్, ఎడిపిసి కమిడి ప్రభాకరరావు, శ్రీ వేద స్కూల్ ఛైర్మన్ గుత్తుల గోవింద జయ రామారావు, డైరెక్టర్స్ నీతూ, అర్జున్ అభినందించారు.

యాంటీ బయోటిక్స్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - యానాం

యానాం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో యాంటీ బయోటిక్స్ వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు మాట్లాడుతూ యాంటీబయోటిక్స్‌ను సొంతంగా వినియోగించకూడదన్నారు ఒకరికి రాసిన యాంటీబయోటిక్స్ మందులను వేరొకరికి వినియోగించకూడదని, ఎక్కువగా వినియోగించడం వల్లఉత్పన్నమయ్య సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ అధికారి డాక్టర్ టి.రవిశంకర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - యానాం

యానాం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యుటేషన్‌పై రెయ్యా శ్రీనివాస్‌ను నియమిస్తూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్ శాఖ కార్యదర్శి వి.జయశంకర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన స్థానిక ఉమెన్ అండ్ ఛైల్డ్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈయన ఏడాది పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం డిప్యుటేషన్‌పై వచ్చి సబ్ రిజిస్ట్రార్ సేవలందిస్తున్న నరేంద్రకుమార్‌ను తిరిగి ఆయన సొంతశాఖకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

సివిల్స్ కోచింగ్‌కు 70 మంది హాజరు

సివిల్స్ కోచింగ్‌కు పరీక్షాపత్రాలను ప్రారంభిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని బిసి స్టడీ సర్కిల్‌లో బుధవారం సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్‌కు ప్రవేశ పరీక్ష పత్రాలను కలెక్టర్ పి.ప్రశాంతి, ట్రైబల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్ అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పరీక్ష నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి మొత్తం 75 దరఖాస్తులు రాగా, 70 మంది అభ్యర్థులు సివిల్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ ప్రవేశ పరీక్షలకు హాజరు అయ్యారన్నారు. యుపిఎస్‌సి సివిల్స్ కోసం ఉచిత కోచింగ్‌లో ప్రవేశానికి కామన్ స్క్రీనింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గొల్లపూడి కేంద్రంలో ఆరు నెలల పాటు వసతులతో కూడిన ఉచితంగా శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ ఆరు నెలల కాలంలో ఉపకార వేతనం కూడా అందిస్తారని పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో గెలుపే లక్ష్యంగా నిరంతర కృషి ద్వారా సాధ్యం అవుతుందని కలెక్టర్ తెలిపారు. సివిల్స్ కోచింగ్‌కు ఎంపికైన అభ్యర్థులు పట్టుదలతో శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణను ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, బిసి స్టడీ సర్కిల్ సంచాలకులు కెఎన్.జ్యోతి, బిసి సంక్షేమాధికారి సత్య రమేష్ పాల్గొన్నారు.

కడియం మార్కెట్‌లో కార్తీక వనసమారాధన

కూరగాయల మార్కెట్లో కార్తీక సమారాధన

ప్రజాశక్తి-కడియం

కడియం వెంకటేశ్వర కూరగాయల మార్కెట్లో బుధవారం కార్తీక అన్నసమారాధన నిర్వహించారు. గత 15 ఏళ్లుగా ఈ కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ అన్నసమారాధనకు ప్రజలతో పాటు పలువురు రైతులు, వివిధ పార్టీల నాయకులు, కూరగాయ వ్యాపారస్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. మార్కెట్ కమిటీ సభ్యులు సింగంశెట్టి నాగేశ్వరరావు, వెలుగుబంటి శ్రీనివాసరావు, దొడ్డా బుజ్జి, సింగన గోవిందు, బైరిశెట్టి వీరభద్రరావు, దోడ్డా శ్రీనివాసరావు, కుసునూరి బాబులు, రావిపాటి వీరభద్రరావు, కడించర్ల సత్యనారాయణ, పడాల సూరిబాబు, తిరుపతి రాంబాబుకు పలువురు అభినందనలు తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో ఎంఎల్ఎ ముప్పిడి పూజలు

ప్రజాశక్తి-గోపాలపురం

దొండపూడిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపించిన ప్రజలు, పెద్దలకు అండగా ఉంటానని తెలిపారు. తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని తెలిపారు. ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటాని తెలిపారు.

సిడిపిఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

మినివర్కర్‌కి పదోన్నతి కల్పించకుండా అన్యాయంగా వ్యవహరిస్తున్న అడ్డతీగల సిడిపిఒపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మావతి, ఎలుగుబంటి చంద్రావతి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అడ్డతీగల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని తిమ్మాపురం సెంటర్ వర్కర్ మృతి చెందడంతో ఆ పోస్టు ఖాళీ అయిందన్నారు. ఆదే పంచాయతీ పరిధిలో డి.కిష్టవరం సెంటర్ మినీ వర్కర్‌కు 12 సంవత్సరాల సర్వీసు కల్గివుందన్నారు. జిఒ ప్రకారం మినీ వర్కర్‌కి అక్కడ పదోన్నతి ఇచ్చే అవకావం ఉన్నా సిడిపిఒ ఆమెకు పదోన్నతి ఇచ్చేది లేదని, అటువంటి జిఒలు ఎన్నో తెస్తాను అంఊ మినీ వర్కర్ పట్ల అవహేళనగా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. తక్షణమే ఆ మినివర్కర్‌కి పదోన్నతి ఇకుంటే ఉద్యమిస్తామని చెప్పారు.

ఘనంగా ఎన్‌సిసి డే ఉత్సవాలు

ఎన్‌సిసి డే ఉత్సవాలను బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

చాగల్లు చాగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎన్‌సిసి విద్యార్థులు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు వి.శ్రీనివాస్, డి.గంగాధర్, జి.చంద్రశేఖర్ కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. ఎన్‌సిసి కేర్ టేకర్ టి.సత్తిరాజు, మాజీ ఎన్‌సిసి ఫస్ట్ ఆఫీసర్ కెఎస్ఎన్.మూర్తి మాట్లాడారు.

ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనిటీ ఫర్ రన్ నిర్వహించారు. హెచ్ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు ఎన్‌సిసి జండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ రన్‌లో ఎన్‌సిసి ట్రూప్ కమాండర్, సెకండ్ ఆఫీసర్ బిఎస్ స్వామి, డి.ఉదయభాస్కర్, ఎస్.లక్ష్మీనారాయణ, ఎన్.నిరీక్షణ రాజు, సిహెచ్.దుర్గాప్రసాద్, ఐ.రాంబాబు, ఎ.సుబ్బారావు, ఎ.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా అజయ్‌బాబు

ప్రజాశక్తి-గోపాలపురం

ఇన్‌ఛార్జి తహశీల్దారు అజయ్ బాబు

గోపాలపురం ఇన్‌ఛార్జి తహశీల్దారుగా డిప్యూటీ తహశీల్దారు కె.అజయ్ బాబును ఫుపుల్ ఎడిషనల్ ఛార్జ్‌తో నియమిస్తూ కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన తహశీల్దారు సిహెచ్.విద్యాపతి కొవ్వూరు ఆర్‌డిఒ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

కోరుకొండ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కోరుకొండ

కోరుకొండ షష్టిలో భాగంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాల పోస్టర్‌ను షష్టి కమిటీ అధ్యక్షుడు ఉల్లి వీరభద్ర సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ షష్టి ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్రి లక్ష్మీ సరోజ గణేష్, బదిరెడ్డి సత్యనారాయణమూర్తి, తాడి హరిశ్చంద్ర ప్రసాద్ రెడ్డి, కేతినీడి అశోక్, ఉల్లి కాశీ, నీరుకొండ బాబ్జీ, కటకం చలం పాల్గొన్నారు.

2వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాళ్లపూడి

తాళ్లపూడిలోనే పుష్కర ఘాట్ వద్ద కార్తీక మాసం సదర్భంగా బుధవారం 2000 మందికి అన్నదానం నిర్వహించారు. ఈ ఘాట్ వద్ద గల గౌతమేశ్వర ఆలయం వద్ద ఆలయ పరిరక్షణ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఈ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఆలయం వద్ద కార్తీక మాసం, మహాశివరాత్రి పర్వదినాల్లో ప్రజలకు అన్నదానం నిర్వహిస్తున్నామని తెలిపారు.

విరాళం అందజేస్తున్న ఎంఎల్ఎ గోరంట్ల

గణపతి ఆలయానికి ఎంఎల్ఎ గోరంట్ల విరాళం

ప్రజాశక్తి-కడియం

వీరవరం గ్రామంలో వీవర్స్ కాలనీలోని లక్ష్మీ గణపతి ఆలయం పునర్నిర్మాణానికి రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి రూ.50 వేల విరాళం బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దాతల సహకారంతో పురాతన ఆలయ పునర్నిర్మాణం చేపడుతున్నామని, నిర్మాణానికి సహకరించిన ఎంఎల్ఎ గోరంట్లకు ఆలయ కమిటీ సభ్యులు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రొబ్బి శేఖర్, సింగ్ సురేంద్ర ప్రసాద్, గోరు నాగేశ్వరరావు, దొంతంశెట్టి శ్రీనివాస్, యర్ర శ్రీను, ఉట్ల శ్రీను తదితరులు ఉన్నారు.

టిడ్కో ఇళ్లు ఇవ్వకుండానే బ్యాంకర్ల ఇఎంఐ వసూలు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలులో తీరుగూడెంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందించకుండానే వారి నుంచి బ్యాంకర్స్ ఇఎంఐ కట్ చేసుకోవటం అన్యాయమని సిపిఎం నాయకులు జువ్వల రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు, టిడ్కో ఇళ్ల వద్ద ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. లబ్ధిదారులు నిరుపేదలు చిన్న షాపుల్లో మాల్స్‌లో పని చేసుకుంటున్నారని, నెల జీతాలు బ్యాంక్ అకౌంట్‌లో వేసిన వెంటనే బ్యాంకర్స్ ఇఎంఐ కట్ చేస్తున్నారని తెలిపారు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మంత్రి కందుల దుర్గేష్ జోక్యం చేసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని, లేకుంటే 1200 మంది లబ్ధిదారులతో నిరసన కార్యక్రమం చేపడతామని రాంబాబు అన్నారు.

జెఎన్‌టియుకెలో పలువురి రక్తదానం

ప్రజాశక్తి - కాకినాడ

ఎన్‌సిసి 18వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సిసి దినోత్సవం సందర్భంగా జెఎన్‌టియుకెలో రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు కళాశాలలకు చెందిన ఎన్‌సిసి క్యాండెట్స్, జెఎన్‌టియుకె విద్యార్థులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు రామారావు పేట హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మేనేజర్ చంద్రబాబు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ కె.మొహమ్మద్ ఆసిఫ్ మేజర్ హేమంత్‌కుమార్, సుబేదార్ గురేందర్‌సింగ్, సుబేదార్ డి.గణేషన్, హవల్దర్ రఫిక్ జానీ, హవలదర్ సునీల్ కుమార్, జి గోపాల్, హవల్దార్ సురేష బాబు, హవల్దార్ బికాస్ గురున పాల్గొన్నారు.

In the Court of the VIIth Additional Junior Civil Judge at Kakinada
O.S. No. 385/2022

Between:
Kovvuri Subba Reddy ...*Plaintiff*
AND
Sathi Srinivas Sudheer Reddy and Another ...*Defendants*

To:
D-1: Sathi Srinivas Sudheer Reddy, S/o. Lakshmana Reddy, Occ: Special Deputy Tahsildar, O/o. Office the Godavari Urban Development Authority (GUDA), NFCL Road, Kakinada. R/o. D.No. 68-10-14/1, Saraswathi Marg, Near Ideal College, Vidyuth Nagar, Kakinada, Kakinada District.
D-2: Sathi Naga Lakshmi, W/o. Srinivas Sudheer Reddy, R/o. D.No. 68-10-14/1, Saraswathi Marg, Near Ideal College, Vidyuth Nagar, Kakinada, Kakinada District.

పై నెంబరు దావాలో 1వ మరియు 2వ ప్రతివాదులు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 06-12-2024వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

CH.KANAKA CHARI, Advocate
D.No. 3-164, Gaigolupadu,
Kakinada, Cell: 9948599037

బాల్య వివాహ ముక్త్ భారత్‌పై అవగాహన

పుష్కర్ ఘాట్ వద్ద క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ పి.ప్రశాంతి, న్యాయమూర్తి సునీత, అధికారులు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

బాల్ వివాహ ముక్త్ భారత్ జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి గంధం సునీత మాట్లాడుతూ బాల్ వివాహ ముక్త్ భారత్ జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు హైకోర్టు సూచనలతో జిల్లాలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై విస్తత ప్రచారంలో భాగంగా ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. బాల్యవివాహాలు నిరోధించే విధంగా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్వాడి, ఆశ, మహిళా పోలీసులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు, 21 సంవత్సరాలలోపు మగ పిల్లలకు వివాహం చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. వారికి వివాహం చ వారికి రెండేళ్ల వరకూ జైలు శిక్ష పడుతుందన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు ఎక్కడైనా సమాచారం ఉంటే వెంటనే గ్రామ స్థాయి అడ్మినిస్ట్రేషన్ అధికారికి, కలెక్టర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ దేశాన్ని బాల్య వివాహ రహితంగా మార్చడంపై కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లాలో లీగల్ సర్వీస్ అథారిటీ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ సమన్వయంతో జిల్లాస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. బాల్యవివాహాలు దేశంలో గ్రామంలోని పట్టణంలోనూ జరగకూడదనేది ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు గ్రామాల్లో పట్టణంలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్య, జిఎస్‌డబ్ల్యూ, రెవిన్యూ, పంచాయతీ, న్యాయశాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేస్తున్నామన్నారు. బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారం అని, బాల్య వివాహాలు కారణంగా బాలిక విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివద్ధిలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయ కుమారి, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, DINTAKURTHY NARAYANA, S/o. CHINA THIMMAYYA, D.No. 9-1-14, Water Works Veedhi, Vinayaka Temple, Rajahmundry, Rajahmundry Urban, E.G.District, A.P. I have changed my name from **DENTAKURTHI NARAYANA RAO** (Old Name) to **DINTAKURTHY NARAYANA** (New Name). Hence forth Iam being called **DINTAKURTHY NARAYANA,** S/o. China Thimmayya, for all purpose.

డిశ్చార్జ్ బుక్ పడిపోయినది

సెవల జయరావు అను నేను ఈ నెల అనగా ది. 21-11-2024వ తేదీన ఆటోలో ప్రయాణిస్తూ అల్లవరం నందు 6891556 సర్వీసు నెంబరు గల నా యొక్క డిశ్చార్జ్ బుక్ పోగొట్టుకొనుట జరిగింది. అది ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

S.JAYARAO (Ex- Army),
D-NO-3-57, THUMMALAPALLI (Post),
BENDAMURLANKA,
Dr. B.R.AMBEDKAR KONASEEMA DISTRICT, PIN-533 210.
Cell : 9866164374

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, కాకినాడ
M.V.O.P. 4/2023

Between:
తోలెం కన్నయమ్మ & వగైరా -పిటీషనర్స్
AND
యడ్ల నాగ సత్తిబాబు & వగైరా -రెస్పాండెంట్స్

R-2: మాకిరెడ్డి అప్పలనాయుడు, S/o. కన్నబాబు, C/o. యడ్ల నాగ సత్తిబాబు, పాత కొట్టాం గ్రామం, కోటనందూరు (మండలం), కాకినాడ జిల్లా.
ట్రాక్టర్ యజమాని, బేరింగ్ నం. AP 31 CR 3683
ట్రాయిలర్ యజమాని,బేరింగ్ నెం. AP 31 TM 0775
R-4: తాళై దుర్గాదేవి, D/o. గురువులు, వయస్సు 32 సం॥లు, డో.నెం. 58-11-13, సంజీవనగర్, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా.

పై నంబరు పిటీషనులో 2వ రెస్పాండెంట్ మరియు 4వ రెస్పాండెంట్ అయిన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపినప్పటికీ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు సమన్లు అమలు నిమిత్తం **ది. 13-12-2024వ తేదీన వాయిదా అయి ఉన్నది. ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయగలరు. లేనిచో మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

(By Court Order)
K.V.BHADRA RAO
K.SRIVANI
K.S.CHANDRA RAO
Advocates, Kakinada
Cell: 94401 77063